సాక్షి
అనంతపురం
శుక్రవారం । 4 । ఆగస్టు । 2023



టన్ను చీనీ @ రూ.17 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.17 వేలు, కనిష్టంగా రూ.5 వేలు, సరాసరిన రూ.12 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.160

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.160, కనిష్టంగా రూ.100, సరాసరిన రూ.135 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
35.4°/22.7°

జిల్లా అంతటా గురువారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం కొనసాగుతోంది.. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఒకట్రెండు ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు పడ్డాయి.

న్యూస్‌రీల్

ఎక్కేద్దామా వందే భారత్

- ఆగస్టు 6 నుంచి కాచిగూడ–యశ్వంతపుర మధ్య రైలు రాకపోకలు



హిందూపురం అర్బన్: కేంద్ర రైల్వే శాఖ ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవలు ఉమ్మడి జిల్లావాసులకు అందుబాటులోకి వచ్చాయి. కాచిగూడ–యశ్వంతపుర మధ్య ఈ నెల 6 నుంచి రైలు రాకపోకలు సాగనున్నాయి. ఈ మేరకు ఆయా రైల్వే స్టేషన్ల సిబ్బందికి గురువారం సమాచారం ఇచ్చారు. దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ డివిజన్‌లోని షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్,గద్వాల, కర్నూలు, గుంతకల్లు డివిజన్ పరిధిలో ద్రోణాచలం, గుత్తి, అనంతపురం, ధర్మవరం, నైరుతి రైల్వే బెంగళూరు డివిజన్ పరిధిలో పెనుకొండ, హిందూపురం, గౌరీబిదనూర్, యశ్వంతపూర్ (బెంగళూరు)లో స్వాగత ఏర్పాట్లు చేయాలని రైల్వే ఉన్నతాధికారులు ఆయా స్టేషన్ల అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. సమయ పట్టిక మాత్రం తెలియరాలేదని అధికారులు తెలిపారు.

కంబదూరులో ఎలుగు బంటి సంచారం

కంబదూరు: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని కాలనీలో బుధవారం రాత్రి ఎలుగు బంటి సంచరించింది. ఇళ్ల మధ్య తిరగడంతో స్థానికులు భయందోళనకు గురయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో ఉన్న కొండలో గ్రానైట్ తవ్వకాలు చేపట్టడంతో అక్కడి నుంచి ఎలుగు బంట్లు గ్రామాలోకి ప్రవేశిస్తున్నట్లు గ్రామస్తులు చెప్పారు. పోలీసులు, ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయండి

- జెడ్పీ సీఈఓ భాస్కరరెడ్డి



గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న సీఈఓ భాస్కరరెడ్డి, హౌసింగ్ ఈఈ కృష్ణారెడ్డి

కూడేరు: అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జెడ్పీ సీఈఓ భాస్కరరెడ్డి ఆదేశించారు. గురువారం ఆయన కూడేరు ఎంపీడీఓ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. పంచాయతీరాజ్ శాఖ తరపున చేపట్టిన ప్రభుత్వ భవన నిర్మాణాలు, జగనన్న కాలనీల్లో చేపట్టిన గృహ నిర్మాణాల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. పనులపై పర్యవేక్షణ తప్పని సరిగా ఉండాలన్నారు. ఇంకుడు గుంతల ప్రయోజనాలపై ప్రజలను చైతన్యపరచాలన్నారు. అనంతరం కూడేరు, ముద్దలాపురంలోని జగనన్న కాలనీల్లో చేపట్టిన గృహ నిర్మాణాలు పరిశీలించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఈఈ కృష్ణారెడ్డి, ఎంపీడీఓ ఎం.కె.బాషా, హౌసింగ్ ఏఈ శేఖర్, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో నేడు 'నాక్' బృందం పర్యటన



ఆర్ట్స్ కళాశాల ముఖద్వారం

రాప్తాడు రూరల్: అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాలను శుక్ర, శనివారాల్లో నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (నాక్) బృందం పరిశీలించనుంది. ఈ క్రమంలో ఇప్పటికే సైకిల్–3లో 'ఏ' గ్రేడ్ గుర్తింపు కలిగిన ఆర్ట్స్ కళాశాలను సైకిల్–4లో ఉన్నత గ్రేడ్ పొందేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. ముగ్గురు సభ్యులు కలిగిన నాక్ కమిటీ రెండు రోజుల పాటు కళాశాలలోని వివిధ విభాగాలతో పాటు అకడమిక్, బోధన, పరిశోధన, విస్తరణ కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల కల్పన, ఉపాధి అవకాశాలు, కళాశాల విలువలు, వినూత్న కార్యక్రమాలు తదితర అంశాలను పరిశీలించనున్నారు.

బడికి డుమ్మా.. కుదరదమ్మా!

విద్యావిధానంలో సీఎం వైఎస్ జగన్ సమూల మార్పులకు శ్రీకారం చుడుతున్నారు. 'మనబడి నాడు–నేడు'తో ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చారు. ఇంగ్లిష్ మీడియంతో విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు పునాదులు వేశారు. విద్యార్థులు ప్రపంచ స్థాయిలో పోటీ పడాలనే ఉద్దేశంతో డిజిటల్ బోధనకు శ్రీకారం చుట్టారు. ఓవైపు వసతుల కల్పనతో పాటు మరోవైపు విద్యార్థుల హాజరుపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.

- సర్కారు బడుల్లో విద్యార్థుల హాజరుపై ప్రత్యేక దృష్టి
- ఒకరోజు బడికి రాకపోయినా తల్లిదండ్రులకు టీచర్ల ఫోన్
- ఆయా విద్యార్థుల ఇళ్లకు వలంటీర్లు
- అనవసరంగా గైర్హాజరు కాకుండా చూడడమే లక్ష్యం



గైర్హాజరైన విద్యార్థి ఇంటికి వెళ్లి మాట్లాడుతున్న బొమ్మనహాళ్ ఎంఈఓ, సచివాలయ ఉద్యోగి



రాప్తాడురూరల్: గతంలో బడిలో చేరిన పిల్లలు రోజూ బడికి వస్తున్నారా? లేదా? అనే పర్యవేక్షణ పెద్దగా ఉండేది కాదు.రోజుల తరబడి రాకపోయినా ఆరా తీసే పరిస్థితి లేదు. గ్రామాల్లో కూలినాలి చేసుకునే తల్లిదండ్రులు ఉదయం లేవగానే పనులకు వెళ్తారు. పిల్లలు బడికి పోతారో.. లేదో తెలిసేది కాదు. మధ్యాహ్నానికి వెనక్కు వచ్చేసినా అడిగేవారు ఉండరు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత పరిస్థితి మారింది. అనవసరంగా బడికి బంక్ కొడతామంటే కుదరదు. ఇకపై స్కూల్‌కి తప్పనిసరిగా హాజరు కావాల్సిందే.

స్టూడెంట్ అటెండెన్స్ యాప్‌లో నమోదు..

విద్యార్థులను పర్యవేక్షించేందుకు హెచ్‌ఎంలతో పాటు వలంటీర్లకు బాధ్యతలు అప్పగించారు. రోజూ విద్యార్థి హాజరును నమోదు చేసేందుకు 'స్టూడెంట్ అటెండెన్స్ యాప్' తీసుకొచ్చారు. స్కూల్ నుంచి మండల, జిల్లా, రాష్ట్రస్థాయి వరకు యాప్‌ను అనుసంధానం చేయడంతో బడికి రాని విద్యార్థుల వివరాలు అన్నిస్థాయిల్లోనూ తెలిసిపోతాయి. విద్యార్థుల కుటుంబాలు మ్యాపింగ్ చేయడం ద్వారా వారివివరాలు సచివాలయాల్లోనూ ఉంటాయి. ఎలాంటి సమాచారం లేకుండా వరుసగా మూడు రోజులు పాఠశాలకు వెళ్లకపోతే రాష్ట్ర అధికారుల నుంచి సచివాలయాలకు సమాచారం వెళ్తుంది. సంబంధిత వలంటీరు నేరుగా విద్యార్థి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి గైర్హాజరుపై ఆరా తీస్తారు. తల్లిదండ్రులకు అవగాహన కల్పించి బడికి పంపేలా చూస్తారు. సర్కారు చర్యలతో పాఠశాలల్లో హాజరుశాతం మెరుగవుతోంది. విద్యార్థుల్లో చదువు పట్ల ఆసక్తి పెరుగుతోంది.

విప్లవాత్మకమైన మార్పు



విద్యార్థుల హాజరు వివరాలు తల్లిదండ్రులు, వలంటీర్ల మొబైల్ ఫోన్లకు అనుసంధానం చేయడం ఒక విప్లవాత్మక మార్పు. విద్యార్థి గైర్హాజరైతే తలిదండ్రుల ఫోన్‌కు, సచివాలయం వలంటీర్‌కు మెసేజ్ వెళ్తుంది. బడికి రాకపోవడానికి గల కారణాలు తెలుసుకొని నివారణ చర్యలు చేపట్టి చదువుకు ఆటంకం లేకుండా చూడొచ్చు. ప్రతి పాఠశాలలో పిల్లల డ్రాపౌట్ రిజిస్టర్ నిర్వహించాలి.

– బాలమురళీకృష్ణ, హెచ్‌ఎం దుద్దేకుంట, అలెస్కో, సమగ్ర శిక్ష

చాలా ఉపయోగకరం



స్టూడెంట్స్ అటెండెన్స్ యాప్ చాలా ఉపయోగకరంగా ఉంది. పిల్లలు గైర్హాజరైన విషయం తలిదండ్రులకు తెలుస్తోంది. ఎక్కువ రోజులు గైర్హాజరయ్యే విద్యార్థుల తలిదండ్రులతో తరగతి టీచరు మాట్లాడి కారణాలు తెలుసుకొని వారు క్రమం తప్పకుండా హాజరు అయ్యేలా చేస్తున్నారు. పిల్లల విద్యా ప్రగతిలో సచివాలయ వలంటీర్లు కూడా భాగస్వాములను చేయటం సంతోషం.

– పద్మశ్రీ, హెచ్‌ఎం, జెడ్పీహెచ్‌ఎస్, హంపాపురం

హాజరు శాతం మెరుగైంది



ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో పిల్లలు ఆలస్యంగా బడికి రావడం తగ్గింది. టీచర్లకు సమాచారం అందించకుండా పాఠశాలలకు గైర్హాజరయ్యే పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి క్రమం తప్పకుండా పంపేలా చర్యలు తీసుకుంటున్నాం. పర్యవేక్షణ ఎక్కువ కావడంతో స్కూళ్లకు విద్యార్థుల హాజరుశాతం బాగా మెరుగుపడింది.

– ఎర్రిస్వామి, టీచరు, జెడ్పీహెచ్‌ఎస్ పాల్తూరు

తల్లిదండ్రుల్లో బాధ్యత పెరిగింది



ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేయడంతో తల్లిదండ్రుల ధోరణిలోనూ మార్పు వచ్చింది. పిల్లలను కచ్చితంగా బడికి పంపాలనే బాధ్యత పెరిగింది. తరచూ పాఠశాలలకు వచ్చి పిల్లల పురోగతిని తెలుసుకోవడం శుభసూచకం. విద్యార్థుల్లో చదువు పట్ల ఆసక్తి పెంచేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. గైర్హాజరయ్యే విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం.

– ఎం.సాయిరామ్, జిల్లా విద్యాశాఖ అధికారి

అగ్నిగుండంలో పడిన యువకుడి కన్నుమూత



గాయాలతో రామమూర్తి (ఫైల్)

రాయదుర్గం రూరల్: అగ్నిగుండంలో పడి తీవ్రంగా గాయపడిన ఓ యువకుడు కన్నుమూశాడు. మండలంలోని కదరంపల్లి గ్రామంలో ఇటీవల మొహర్రం నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో గత శనివారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో గ్రామానికి చెందిన గొల్ల చంద్ర కుమారుడు గొల్ల రామమూర్తి (30) ప్రమాదవశాత్తూ పడిపోయాడు. గ్రామస్తులు వెంటనే అప్రమత్తమై యువకుడిని బయటకు తీసుకొచ్చారు. చికిత్స కోసం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. 6 రోజులుగా చికిత్స పొందుతున్న ఆయన గురువారం తుదిశ్వాస విడిచారు. మృతుడికి భార్య లత, ఇద్దరు కుమారులు ఉన్నారు. రామమూర్తి మృతిపై గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బొజ్జప్ప, మాజీ వైస్ ఎంపీపీ బాబులు, సచివాలయాల మాజీ కన్వీనర్ ధనుంజయ సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

6న జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు



అనంతపురం: జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 6న నగరంలోని ఇండోర్ స్టేడియంలో సబ్ జూనియర్ తైక్వాండో పోటీలు నిర్వహించనున్నట్లు గౌరవ చైర్‌పర్సన్ కే. శాంతి రాజ్ ఓ ప్రకటనలో తెలిపారు. మొదటి స్థానం సాధించే బాల, బాలికలు కర్నూలు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

జల చౌర్యానికి పాల్పడితే చర్యలు

- హెచ్చెల్సీ ఈఈ వెంకటరమణా రెడ్డి



హెచ్చెల్సీ కాలువలో వేసిన పైపులను తొలగిస్తున్న ఈఈ, డీఈఈలు

కణేకల్లు: తుంగభద్ర ప్రధాన ఎగువ కాలువ నుంచి జలచౌర్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చెల్సీ ఈఈ ఎం.వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. కణేకల్లు సమీపంలో హెచ్చెల్సీ కాలువను గురువారం డీఈఈ మద్దిలేటి, ఏఈఈ అల్తాఫ్‌తో కలిసి ఈఈ పరిశీలించారు. కణేకల్లు హెచ్చెల్సీ అతిథి గృహంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాన్ ఆయకట్టు భూముల్లో పంటలు సాగు చేయొద్దని రైతులకు సూచించారు. తుంగభద్ర నది పరివాహక ప్రాంతంలో వర్షాభావ పరిస్థితులతో టీబీ డ్యాంలో నీటి నిల్వ గతేడాది కంటే చాలా తక్కువగా ఉందన్నారు. జిల్లాలో తాగునీటి అవసరాలకు నీరు అందిస్తూనే హెచ్చెల్సీ ఆయకట్టు రైతులకు న్యాయం చేయాల్సి ఉందన్నారు. నాన్ ఆయకట్టు భూముల్లో పంటలు సాగు చేసి మెయిన్ కెనాల్ నుంచి జలచౌర్యం చేస్తే అసలైన ఆయకట్టు రైతులకు ఇబ్బందిగా మారుతుందన్నారు. ఆంధ్రా సరిహద్దు 105 కిలోమీటర్ వద్ద గురువారం వరకు రోజు 500 క్యూసెక్కుల నీరు డ్రా చేసినట్లు తెలిపారు. శుక్రవారం నుంచి 1,000 క్యూసెక్కుల నీరు ఇవ్వాలని టీబీ బోర్డుకు ఇండెంట్ ఇచ్చినట్లు వెల్లడించారు. కెనాల్ పరిస్థితి చూసుకుని క్రమేపీ ఎక్కువ నీరు డ్రా చేసుకొంటూ వెళ్తామన్నారు. వచ్చే వారంలో 1,500 క్యూసెక్కుల నీరు తీసుకుంటామని, ఆగస్టు 15 నుంచి 1,800 క్యూసెక్కుల నీరు డ్రా చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం నీటిని ఎంపీఆర్, పీఏబీఆర్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. హెచ్చెల్సీ ఆయకట్టుకు ఐఏబీ తర్వాత సాగునీరిస్తామని చెప్పారు.

బా'బ్బాబు' అన్నా.. అంతంతే

- జనం లేక చప్పగా చంద్రబాబు యాత్ర
- వారం రోజులుగా 'పరిటాల' జన సమీకరణ చేసినా స్పందన కరువు



హంద్రీనీవా కాలువ సమీపంలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న టీడీపీ అధినేత చంద్రబాబు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: టీడీపీ అధినేత చంద్రబాబు జిల్లా పర్యటన అట్టర్‌ఫ్లాప్ అయింది. చంద్రబాబు వస్తున్నారు.. బాబ్బాబూ రండంటూ.. మాజీ మంత్రి పరిటాల సునీత, ఆమె కుమారుడు పరిటాల శ్రీరామ్ వారం నుంచి జనాన్ని పోగేసేందుకు చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టాయి. సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసంపై యుద్ధభేరి అంటూ బాబు చేసిన యాత్రకు జనం నుంచి స్పందన కరువైంది. గురువారం మధ్యాహ్నం ఆత్మకూరు వద్ద హంద్రీ నీవా లిఫ్ట్ ఇరిగేషన్ పంపింగ్ హౌస్ పనులను చంద్రబాబు పరిశీలించారు. అనంతరం ప్రజలనుద్దేశించి మాట్లాడారు. అక్కడికి వచ్చిన జనం కన్నా.. చంద్రబాబు సమావేశాన్ని కవరేజ్ చేయడానికి వచ్చిన వారే ఎక్కువగా ఉన్నట్లు కనిపించింది. దీంతో సహనం కోల్పోయిన టీడీపీ అధినేత.. స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డిపై నోరు పారేసుకున్నారు. అధికారంలోకి రాగానే పేరూరు డ్యాంకు నీళ్లు తెస్తానని హామీ ఇచ్చారు. భూములిచ్చిన రైతులకు పరిహారం చెల్లించే బాధ్యత తనదేనన్నారు. ప్రసంగం అనంతరం అక్కడి నుంచి అనంతపురంలోని కోవూరు నగర్‌లో ఉన్న కాలువ శ్రీనివాసులు ఇంటికి చంద్రబాబు చేరుకున్నారు.జిల్లాలో రాజకీయ స్థితిగతులపై చర్చించారు. అక్కడి నుంచి నేరుగా 44వ జాతీయ రహదారి మీదుగా కియా పరిశ్రమకు వెళ్లారు. అక్కడ సెల్ఫీ తీసుకుని ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. 6 గంటలకు కియా నుంచి బయలు దేరి కొడికొండ చెక్‌పోస్టు మీదుగా కదిరి వెళ్లి అక్కడే బస చేశారు.

అనంతపురంలో రచ్చరచ్చ..

చంద్రబాబు పర్యటనలో అడుగడుగునా ఆ పార్టీలోని నేతల మధ్య అంతర్గత విభేదాలు వెలుగు చూశాయి. అనంతపురం రూరల్ మండల పరిధిలోని ఎంవైఆర్ ఫంక్షన్ హాలులో గురువారం ఉదయం ఆయన నిర్వహించిన సమావేశంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కాలువ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకరచౌదరి వర్గాల మధ్య తీవ్ర తోపులాట చోటు చేసుకుంది. ఒకరినొకరు తోసుకుంటూ రెండు వర్గాలు రచ్చరచ్చ చేశాయి. మీడియా ప్రతినిధులు, పోలీసులపై చంద్రదండు ప్రకాష్ నాయుడు రెచ్చిపోయారు. ఈ క్రమంలోనే అక్కడికి వచ్చిన న్యాయవాదులు అవమానంతో వెనుదిరిగారు. టీడీపీ నేతల వర్గాల బాహాబాహీ చూసి ఆ పార్టీ కిందిస్థాయి కార్యకర్తలు కూడా అసహనం వ్యక్తం చేశారు.

సేవల్లో 'రెవెన్యూ' అగ్రగామి

- లబ్ధిదారులకు వరంగా మారిన 'జగనన్న సురక్ష'
- అందించిన మొత్తం సేవలు 2,47,641
- ఉచిత సేవలపై హర్షం



'జగనన్న సురక్ష'కార్యక్రమంలో సేవల వివరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమి (ఫైల్)

జగనన్న సురక్ష కింద అందించిన మొత్తం సేవలు : 2,47,641

అందులో రెవెన్యూ శాఖకు సంబంధించిన సేవలు : 2,28,116

అనంతపురం అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అందించిన సేవల్లో రెవెన్యూ శాఖ అగ్రస్థానంలో నిలిచింది. నెల రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో మొత్తం 2,51,614 అభ్యర్థనలు రిజిస్టర్ కాగా, 2,47,641 సేవలను ప్రజలకు అందించారు. ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించిన సేవలు 2,28,116 ఉన్నాయి. సమీకృత (కుల,జనన, ఆదాయ) ధ్రువపత్రం, ఆదాయ ధ్రువపత్రం, తదితర సేవలను ఎక్కువ శాతం ప్రజలు అందుకున్నారు. వీరందరికీ ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా జారీ చేశారు.

రెవెన్యూకు 2,30,118 అభ్యర్థనలు

జగనన్న సురక్ష కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు సంబంధించి మొత్తం 2,30,118 అభ్యర్థనలు రిజిస్టర్ అయ్యాయి. ఇందులో 2,28,116 సేవలను ప్రజలకు అందించారు. అత్యధికంగా సమీకృత (కుల,జనన, ఆదాయ) ధ్రువీకరణ పత్రం కోసం 1,12,469 అభ్యర్థనలు రిజిస్టర్ కాగా, 1,11,337 మందికి సేవలు అందించారు. ఆదాయ ధ్రువపత్రం కోసం 1,07,093 అభ్యర్థనలు రిజిస్టర్ కాగా, 1,06,707 మందికి సరిఫికెట్ జారీ చేశారు.

ముంగింటకే ప్రభుత్వ సేవలు

రెవెన్యూ శాఖ ద్వారా ఏదేని ధ్రువీకరణ పత్రం పొందాలంటే మీ–సేవ లేదా సచివాలయం ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకు నిర్దేశించిన ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఆ తరవాత ధ్రువీకరణపత్రం అందుకునేందుకు ఆలస్యం అయ్యేది. అయితే నెల రోజుల పాటు జిల్లాలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలు ఉచితంగా ప్రభుత్వ సేవలను అందుకున్నారు. వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి ధ్రువీకరణ పత్రం కోసం అభ్యర్థనను రిజిస్టర్ చేసుకున్నారు. ప్రతి సచివాలయం పరిధిలో క్యాంపు నిర్వహించి ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందజేశారు.

రెవెన్యూ శాఖ ద్వారా అందిన సేవలు


ధ్రువపత్రం	అభ్యర్థనలు	అందించిన సేవలు
సమీకృత	1,12,469	1,11,337
ఆదాయ	1,07,093	1,06,707
సమీకృత (రీ-ఇష్యూ)	3,739	3,739
ఆదాయ (రీ-ఇష్యూ)	2,892	2,892
1బీ	1,670	1,670
అడంగల్	1,196	1,196
కుటుంబసభ్యుల పత్రం	465	315
మరణ, జనన పత్రాలు	353	125
టైటిల్ డీడ్ మ్యుటేషన్	094	20
ఇన్‌కమ్ అసెట్	48	43
ఓబీసీ	55	47
పొసెషన్ పత్రం	28	9
టైటిల్‌డీడ్, పాస్‌బుక్ ముద్రణ	16	16

నిండుకుండలా తుంగభద్ర

బొమ్మనహాళ్: కర్ణాటక రాష్ట్రం హొస్పేటలోని తుంగభద్ర జలాశయంలో 83.180 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు బోర్డు అధికారులు వెల్లడించారు. ఎగువ ప్రాంతాల్లోని శివమొగ్గ, ఆగుంబే, శృంగేరి, చిక్కమగళూరు, వరనాడు తదితర ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో డ్యాంకు ఇన్‌ఫ్లో తగ్గినట్లు తెలిపారు. గురువారం ఉదయానికి 21,492 క్యూసెక్కుల వరద డ్యాంలోకి చేరిందని వివరించారు. డ్యాం పూర్తిస్థాయి నీటి మట్టం 1,633 అడుగులు కాగా, ప్రస్తుతం 1,626.99 అడుగుల మేర నీరు చేరింది. డ్యాం నుంచి హెచ్చెల్సీ, ఎల్లెల్సీ, రాయబసవన్న కెనాల్‌కు 2,253 క్యూసెక్కులు అవుట్‌ఫ్లో రూపంలో బయటికి వెళ్తోంది. ఆంధ్రా సరిహద్దులో (105వ కిలోమీటర్ వద్ద) 1,078 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

1,000 క్యూసెక్కులకు ఇండెంట్

అనంతపురం సెంట్రల్: తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీకి 1,000 క్యూసెక్కుల నీరు విడుదల చేయాలంటూ హెచ్చెల్సీ ఎస్‌ఈ రాజశేఖర్ టీబీ బోర్డుకు గురువారం ఇండెంట్ సమర్పించారు. జలాశయం నుంచి తొలుత 500 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేశారు. క్రమంగా 1,000 క్యూసెక్కులకు పెంచుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. మరో వారం తర్వాత 1,500 క్యూసెక్కులకు, చివరకు 1,800 క్యూసెక్కులు చొప్పున తీసుకోవాలని భావిస్తున్నారు. ఇదిలా ఉంటే గురువారం పీఏబీఆర్‌లోకి తుంగభద్ర జలాలు చేరుకున్నాయి. హెచ్‌ఎల్‌ఎంసీ లింక్ కెనాల్ నుంచి పీఏబీఆర్‌కు నీటిని తరలిస్తున్నారు. సాగు, తాగునీటికి ఇబ్బంది లేకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.



నీటితో తొణికిసలాడుతున్న తుంగభద్ర జలాశయం

క్లుప్తంగా

'జగనన్న సురక్ష' విజయవంతం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా'



మాట్లాడుతున్న పైలా నరసింహయ్య

అనంతపురం క్రైం: ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం జిల్లాలో విజయవంతమైనట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య పేర్కొన్నారు. గురువారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నెల 1 నుంచి 31వ తేదీ వరకు జిల్లాలోని 663 గ్రామ, వార్డు సచివాలయాలల పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో 2,47,641 మందికి రెవెన్యూ, ఆధార్, సివిల్ సప్లై, ఆరోగ్య, మునిసిపాలిటీ, తదితర సేవలను ఉచితంగా అందజేసినట్లు గుర్తు చేశారు. వలంటీర్లు, గృహసారథులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు సమర్థవంతంగా పని చేసి సత్ఫలితాలు రాబట్టడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

తపాలా ఉద్యోగుల సమ్మెబాట

అనంతపురం సిటీ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ తపాలా శాఖ ఉద్యోగులు సమ్మెబాట పట్టనున్నారు. ఈ మేరకు అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం ఏపీ సర్కిల్ కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణయ్య గురువారం తెలిపారు. దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని ఇప్పటికే అనేక పర్యాయాలు వివిధ రూపాల్లో నిరసనలు తెలిపినట్లు గుర్తు చేశారు. ఆందోళనలకు దిగిన ప్రతిసారి చర్చలకు పిలవడం, ఆ తరువాత వాటిని విస్మరించడం పరిపాటిగా మారిందని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్, నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ డాక్ సేవక్(ఎన్‌యూ జీడీఎస్) సంఘాల పిలుపు మేరకు ఈ నెల 10న డివిజనల్ పోస్టాఫీసుల ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగులందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

చిన్నారుల ఎదుగుదలకు ఎన్‌ఆర్‌సీ



ఈమె పేరు నాగమణి. కణేకల్లు మండలం హనకనహళ్ గ్రామం. నెల రోజుల క్రితం తీవ్ర జ్వరం బారిన పడిన తన కుమార్తె కృష్ణప్రియను తీసుకుని భర్త నరసింహులుతో కలసి అనంతపురంలోని సర్వజనాస్పత్రికి వచ్చింది. పరీక్షించిన వైద్యులు యూరిన్ ఇన్‌ఫెక్షన్‌తో పాటు పౌష్టికాహార లోపంతో కృష్ణప్రియ బాధపడుతోందని గుర్తించారు. వెంటనే ఎన్‌ఆర్‌సీలో అడ్మిట్ చేసుకుని చికిత్స మొదలు పెట్టారు. కేవలం 12 రోజుల వ్యవధిలోనే కృష్ణప్రియ కోలుకుంది. వైద్యులు, సిబ్బంది మెరుగైన వైద్యం, పౌష్టికాహారం అందించి తన బిడ్డకు పునర్జన్మనందించారంటూ నాగమణి హర్షం వ్యక్తం చేస్తోంది.

- పౌష్టికాహార లోపంతో బాధపడేవారికి 14 రోజుల సేవలు
- చిన్నారులకందుతున్న వైద్యం పట్ల తల్లిదండ్రుల ఆనందం

అనంతపురం క్రైం: పౌష్టికాహార లోపంతో బాధపడే చిన్నారులకు అనంతపురంలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రి (జీజీహెచ్)లోని న్యూట్రిషియన్ రీహేబిలిటేషన్ సెంటర్(ఎన్‌ఆర్‌సీ). వరంగా మారింది. పోషకాహార లోపంతో బక్కచిక్కపోయి, వివిధ రకాల ఇన్‌ఫెక్షన్లతో తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న 0–59 నెలల వయసున్న పిల్లలందరికీ నేషనల్ హెల్త్ మిషన్ నిధులతో ఉచితంగా చికిత్సనందిస్తున్నారు.



ఎన్‌ఆర్‌సీలో పసికందులకు సేవలందిస్తున్న డాక్టర్ సతీష్



పౌష్టికాహారాన్ని అందిస్తున్న వంట మనిషి

వైద్య సేవల్లో ప్రత్యేక చొరవ..

ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో 2014, అక్టోబర్‌లో 20 పడకల సామర్థ్యంతో ఎన్‌ఆర్‌సీ యూనిట్ ప్రారంభమైంది. 2014లో 170, 2015లో 342, 2016లో 350, 2017లో 220, 2018లో 221, 2019లో 444, 2020లో 78, 2022లో 889, ఈ ఏడాది ఇప్పటి వరకూ 211 మంది చిన్నారులు వైద్యం పొందారు. వైద్యులు డాక్టర్ సతీష్, డాక్టర్ షబానా, న్యూట్రిషీయన్ కౌన్సిలర్లు సౌజన్య, పల్లవి, స్టాఫ్‌నర్సులు దివ్యాంజలి, పవిత్ర, చెన్నమ్మ, వంట మనిషి శరణ్య, అటెండర్ శకుంతల, తదితరులు ప్రత్యేక చొరవ తీసుకుని చిన్నారులకు సేవలందిస్తున్నారు.

రోజూ 7 నుంచి 9 సార్లు పోషకాహారం..

పోషకాహార లోపంతో బాధపడుతున్న చిన్నారులు ఎదుర్కొంటున్న సమస్యకు అనుగుణంగా చికిత్స అందజేస్తూనే రోజూ 7 నుంచి 9 సార్లు ఫార్ములా 100, 75, సీరియల్ బేస్డ్ 75 (పాలు, నీరు, చక్కెర, బొరుగులు, కొబ్బరినూనె, ఉడికించిన కూరగాయలు, కిచిడి, నెయ్యితో చేసిన రాగిసర, అటుకుల పాయసం, తాజా కూరగాయలు, పండ్లు, బెల్లంతో చేసిన సున్నుండలు) అందజేస్తున్నారు. ఉదయం 8 నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రతి రెండు గంటలకోసారి పౌష్టికాహారం అందిస్తారు. తీవ్రమైన పోషకాహార లోపం ఉన్న వారికి అర్ధరాత్రి మరో రెండుసార్లు పౌష్టికాహారం అందిస్తారు. ఇలా 14 రోజుల పాటు చిన్నారులను అడ్మిషన్‌లో ఉంచుకుని వారు సంపూర్ణంగా కోలుకున్న తర్వాత డిశ్చార్జ్ చేస్తున్నారు. అనంతరం నాలుగుసార్లు ఫాలో అప్ ట్రీట్‌మెంట్ ఇస్తారు. చివరి ఫాలోఅప్‌లో 14 రోజుల అడ్మిషన్‌కు గాను రూ.1,400ను చెక్కు రూపంలో అందజేస్తారు.

ఉచిత సేవలు



పౌష్టికాహారం లోపంతో బాధపడుతున్న చిన్నారులకు ఎన్‌ఆర్‌సీలో అడ్మిషన్‌లో ఉంచి మెరుగైన సేవలందిస్తున్నాం. వైద్యులు, న్యూట్రిషీయన్ కౌన్సిలర్లు, స్టాఫ్‌నర్సుల పర్యవేక్షణలో చిన్నారులకు కార్పొరేట్ తరహాలో వైద్యం అందిస్తున్నాం. పౌష్టికాహార లోపంతో ఇబ్బందిపడుతున్న చిన్నారులను ఆస్పత్రికి తీసుకువచ్చిన ప్రోత్సాహకాలనూ అందజేస్తున్నాం. ఈ ఉచిత సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు, జీజీహెచ్ సూపరింటెండెంట్

రైతు భరోసా కేంద్రం తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ

పుట్లూరు: మండలంలోని శనగలగూడూరు రైతు భరోసా కేంద్రాన్ని గురువారం జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ తనిఖీ చేశారు. ఈ క్రాప్ బుకింగ్‌ను ఎలాంటి తప్పులు లేకుండా పూర్తీ చేయాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఏడీఏ చెంగళరాయుడు, ఏఓ కత్యాయని, వీహెచ్ఏ రామలక్ష్మి పాల్గొన్నారు.

పరస్పరం ఢీకొన్న వాహనాలు

- వివాహిత దుర్మరణం
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ భర్త మృతి
- మరో ఇద్దరి పరిస్థితి విషమం



తీవ్రంగా గాయపడిన హనుమంతరాయప్ప

అగళి: రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ వివాహిత దుర్మరణం పాలైంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆమె భర్త కూడా మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... పావగడ తాలూకా రొప్పం గ్రామానికి చెందిన హనుమంతరాయప్ప (45), రాధమ్మ (38) దంపతులు. రొళ్ల మండలం రత్నగిరిలోని తన పుట్టినింటికి భర్తతో కలసి రాధమ్మ వచ్చింది. గురువారం సాయంత్రం తన సోదరుడు మంజునాథ్‌తో కలసి స్వగ్రామానికి కారులో బయలుదేరింది. అగళి మండలం పి.బ్యాడిగెర వద్దకు చేరుకోగానే ఎదురుగా హిందూపురానికి వేగంగా వెళుతున్న టాటాఏస్ వాహనం ఢీకొంది. ఘటనలో కారులోనే చిక్కుకుని రాధమ్మ మృతి చెందింది. మంజునాథ్, హనుమంతరాయప్పతో పాటు ప్రమాదానికి కారణమైన టాటాఏస్ వాహన డ్రైవర్ ఖలీమ్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే శిర పట్టణంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక హనుమంతరాయప్ప మృతిచెందాడు. మంజునాథ్, ఖలీమ్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. సమాచారం అందుకున్న అగళి ఎస్ఐ లావణ్య అక్కడకు చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేశారు.

తరగతి గదిలో సొమ్మసిల్లిన విద్యార్థి

శెట్టూరు: తరగతి గదిలో ఓ విద్యార్థి సొమ్మసిల్లి పడిపోయాడు. పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఇమామ్‌వలి తెలిపిన మేరకు... శెట్టూరు మండలం లక్ష్మంపల్లిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 250 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాల హెచ్‌ఎం సిరాజుద్దీన్, మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకుడికి మధ్య వివాదం తలెత్తడంతో విద్యార్థులకు భోజనం అందకుండా పోయింది. ఏడాది కాలంగా హెల్పర్‌ను నియమించాలని విన్నవించినా ఆయన పట్టించుకోలేదు. దీంతో సకాలంలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని ఏజెన్సీ నిర్వాహకుడు అందించలేకపోతున్నాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం 11 గంటలకు రాగిజావ విద్యార్థులకు అందలేదు. మధ్యాహ్నం భోజనం కూడా సమయానికి తయారు సిద్ధం కాలేదు. దీంతో ఆకలితో తల్లడిల్లిపోయిన విద్యార్థి మంజునాథ్ తరగతి గదిలోనే సొమ్మసిల్లిపడిపోయాడు. విషయం తెలుసుకున్న ఎంఈఓ శ్రీధర్ వెంటనే స్పందించి పాఠశాలకు చేరుకుని పరిశీలించారు. హెచ్ఎం, మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకుడితో మాట్లాడి, అప్పటికప్పుడు వంటలు సిద్ధం చేయించడం 3 గంటలకు విద్యార్థులు భోజనం చేశారు. హెచ్ఎం తీరుపై ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడ్డారు.



సొమ్మసిల్లి పడిపోయిన విద్యార్థి మంజునాథ్

బాబును కుప్పం వాసులే నమ్మడం లేదు

- ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం: సొంత అడ్డాగా చెప్పుకునే కుప్పంలోనే టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబును ప్రజలు నమ్మడం లేదని, రాబోవు ఎన్నికల్లో ఆయనను చిత్తుగా ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి తెలిపారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు అన్నట్లు 2024 తర్వాత పార్టీ లేదు.. బొక్క లేదు మాట ముమ్మాటికీ నిజం కాబోతుందన్నారు. రాయదుర్గంలోని రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయం దండగ అంటూ పేర్కొన్న చంద్రబాబుకు ప్రాజెక్టులపై మాట్లాడే అర్హత లేదన్నారు. అభివృద్ధి పేరుతో అందిన కాడికి దోచుకున్న తీరు ప్రజలందరికీ తెలుసునన్నారు. జీడిపల్లి నుంచి బీటీపీకి నీర్చిప్పే విషయంలో బాబు చేసిన మోసానికి భూ నిర్వాసితులు కోలుకోలేకపోయారన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని రైతులకు ఎలాంటి పరిహారం చెల్లించకుండానే కాలవ తవ్వకం పనులు చేపట్టిన నీచ చరిత్ర చంద్రబాబుదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత భూములో కోల్పోయిన రైతులకు రూ.162 కోట్ల పరిహారం అందించన గొప్ప చరిత్ర సీఎం వైఎస్ జగన్‌దన్నారు. బాబు చెప్పే రూ.926 కోట్లు కాగితాల్లో తప్పా మరెక్కడా కనిపించడం లేదన్నారు.

సీఎం వైఎస్ జగన్ పాలన దేశ రాజకీయాల్లోనే సువర్ణ అధ్యాయమని కొనియాడారు. జగనన్న సురక్ష కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. నియోజకవర్గంలోని 96 సచివాలయాల పరిధిలో 84,873 ధ్రువీకరణ పత్రాలను అర్హులైన వారికి ఉచితంగా అందజేశామన్నారు. వీటి ద్వారా వారికి సంక్షేమ ఫలాలు దక్కుతాయన్నారు. వివక్ష చూపకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాల లబ్ధి చేకూర్చిన ఘనత సీఎం జగన్‌కు మాత్రమే దక్కిందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు మంచి చేస్తుంటే టీడీపీ నాయకులు ఓర్వలేక పోతున్నారని మండిపడ్డారు. సమావేశంలో మార్కెట్ యార్డు చైర్మన్ భోజరాజ్‌నాయక్, వైస్ చైర్మన్ మేకల శ్రీనివాసులు, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్ర రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, నాయకులు బోర్‌వెల్ నాగిరెడ్డి, కాంట్రాక్టర్ రాజేంద్రరెడ్డి, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, మున్సిపల్ వైస్ చైర్మన్లు శ్రీనివాస్‌యాదవ్, వలీబాషా, కౌన్సిలర్లు, పార్టీ ఇన్‌చార్జ్‌లు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ యువనేత బలవన్మరణం



శ్రీనివాసులు (ఫైల్)

సోమందేపల్లి: ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధుల వేధింపులు తాళలేక బీజేపీ యువనేత ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. సోమందేపల్లి మండలం రూకలపల్లికి చెందిన శ్రీనివాసులు (32), నందిని దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వ్యవసాయం చేస్తూ జీవనం సాగించే శ్రీనివాసులు బీజేపీలో క్రియాశీలక కార్యకర్తగా పనిచేస్తూ యువనేతగా గుర్తింపు పొందాడు. పార్టీ కార్యక్రమాలకు, ఇతర అవసరాలకు రూ.10 లక్షల వరకూ అప్పులు చేశాడు. ఈ క్రమంలో కంతులు సక్రమంగా చెల్లించకపోవడంతో హిందూపురంలోని ఓ ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు వారం రోజుల క్రితం శ్రీనివాసులు ఇంటి వద్దకెళ్లి గొడవ చేశారు. అప్పటి నుంచి తన పరువు పోయిందంటూ ఆవేదనతో కుంగిపోయిన ఆయన బుధవారం రాత్రి తన ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి భార్య నందిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఏఎస్ఐ మురళి తెలిపారు.

ఉత్సాహంగా ఉట్ల పరుష

బత్తలపల్లి: మొహర్రం ఉత్సవాల్లో భాగంగా బత్తలపల్లి మండలం అప్పరాచెరువులో గురువారం ఉట్ల పరుషను ఉత్సాహంగా నిర్వహించారు. పీర్ల చావిడి ఎదుట ఏర్పాటు చేసిన ఈ ఉత్సవంలో 40 అడుగుల ఉట్లమాను ఎక్కేందుకు బోయ సామాజిక వర్గానికి చెందిన 20 మంది యువకులు పోటీ పడ్డారు. ఈ వేడుకను చూసేందుకు చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. గ్రామ పెద్దల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం సాయంత్రం 4.30 నుంచి ఆరు గంటల వరకూ ఎంతో ఉత్కంఠగా సాగింది. చివరకు యువకులు ఉట్లమాను పైకి చేరు కోవడంతో ప్రజలు చప్పట్లు కొట్టి అభినందించారు.



ఉట్లమాను ఎక్కేందుకు పోటీ పడుతున్న యువకులు

ఇంటికో మొక్క.. ఆరోగ్యానికి రక్ష



జగనన్న కాలనీలో మొక్కలు నాటిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి

- ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి

ధర్మవరం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, ఇంటికో మొక్క నాటి పెంచి పోషిస్తే ఆరోగ్యానికి రక్షగా ఉంటుందని ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి అన్నారు. పట్టణంలో కొత్తగా ఏర్పాటవుతున్న జగనన్న కాలనీల్లో ప్రతి ఇంటా ఓ మొక్క విధిగా నాటి సంరక్షించేలా చర్యలు తీసుకున్న ఎమ్మెల్యే.... గురువారం కుటుంబసభ్యులతో కలసి పోతులనాగేపల్లి రోడ్డులోని జగనన్న లేఔట్‌లో పర్యటించారు. ఎమ్మెల్యే సతీమణి సుప్రియ, సోదరుడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి, 40 వార్డుల కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బంది, మున్సిపల్ అధికారులతో కలసి ప్రతి ఇంటి ఎదుట మొక్కలు నాటి, నీరు పోశారు. ఏకంగా ఒకే రోజు 4 వేల మొక్కలు నాటి రికార్డు సృష్టించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి మాట్లాడుతూ... కాలుష్య కోరల్లో చిక్కుకుని మానవాళి మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. కాలుష్యాన్ని నివారించాలంటే పచ్చని మొక్కలు నాటి సంరక్షించడం ఒక్కటే మార్గమన్నారు. ఇందుకు తనవంతుగా జగనన్న కాలనీల్లో 13 వేలకు పైగా మొక్కలను నాటి, లబ్ధిదారుల భాగస్వామ్యంతో సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రెండో దశ కింద పట్టణంలోని 40వేల ఇళ్ల వద్దరూ ఇదే తరహాలో మొక్కలు నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, వైస్ చైర్మన్లు వేముల జయరామిరెడ్డి, షంషాద్‌బేగం, వార్డు సచివాలయాల కన్వీనర్లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్, అన్ని వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

పంటల సాగు చేపట్టండి



సూచనలిస్తున్న ఉద్యానాధికారి చంద్రశేఖర్

పుట్టపర్తి: వ్యవసాయానికి ప్రభుత్వం పెద్ద పీట వేసిందని, ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోయిన ప్రతి రైతుకూ ఉచిత పంటల బీమా పరిహారాన్ని అందజేస్తోందని రైతులకు జిల్లా ఉద్యాన అధికారి చంద్రశేఖర్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి సూచించారు. భూములను బీడు పెట్టకుండా తమకు తోచిన ఏదో ఒక పంట పెట్టాలన్నారు. బుక్కపట్నం మండలం చంద్రాయునిపల్లి సమీపంలోని మామిడి తోటలో గురువారం నిర్వహించిన తోట బడి కార్యక్రమంలో వారు మాట్లాడారు. మామిడి సాగులో చేపట్టాల్సిన సస్య రక్షణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రమణయ్య, హెచ్ఓ నవీన్, సచివాలయ అసిస్టెంట్ ఆశాజ్యోతి, అన్నపూర్ణ, రైతులు పాల్గొన్నారు.

రేపు జిల్లాకు మంత్రి పెద్దిరెడ్డి

అనంతపురం క్రైం: వైఎస్సార్ సీపీ అనంతపురం, శ్రీసత్య సాయి జిల్లాల ప్రాంతీయ సమన్వయకర్త, రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఈ నెల 5న జిల్లాకు రానున్నారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య గురువారం 'సాక్షి'కి తెలిపారు.

టీటీ పోటీలు ప్రారంభం

లేపాక్షి: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో రీజినల్ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలను తహసీల్దార్ బాబు, ప్రిన్సిపాల్ నాగరాజు గురువారం ప్రారంభించారు. అంతకు ముందు సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు అలరించారు.

గొడవలకు ఆజ్యం పోసిన టీడీపీ సర్పంచ్

- తన కట్టడిలో గ్రామం ఉండాలని రౌడీలతో దాడికి యత్నం
- గ్రామస్తుల ప్రతిఘటనతో కుట్ర భగ్నం

రాయదుర్గం రూరల్: గ్రామాభివృద్ధికి పాటుపడాల్సిన సర్పంచ్ అందుకు విరుద్ధంగా గొడవలకు ఆజ్యం పోశాడు. చివరకు ఇతర మండలాల నుంచి రౌడీ మూకను రప్పించి గ్రామస్తులపై దాడి చేయించాడు. మండలంలోని వడ్రహొన్నూరు గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామ ప్రజలందరినీ తన గుప్పిట్లో ఉంచుకోవాలనే కుయుక్తితో టీడీపీ మద్దతు సర్పంచ్ అంగడి అశోక్ కుట్ర రాజకీయాలకు తెరలేపాడు. గ్రామపెద్దలు హనుమంతరెడ్డి, సోమశేఖర్, భీమప్ప, తిప్పేస్వామి, హనుమంతు తెలిపిన మేరకు.. మొహర్రం అనంతరం మూడు రోజుల కార్యక్రమంలో భాగంగా పున్నమి రోజున జంతుబలి ఇచ్చి అన్నదానం చేయడంతో పాటు పీర్ల చావిడికి అందిన కానుకలు లెక్కించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో పీర్లకు నైవేద్యం సమర్పించిన అనంతరం గ్రామస్తులంతా సామూహిక భోజనాలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తుండగా మరోవైపు పీర్ల చావిడికి కానుకల రూపంలో అందిన రూ.11.52 లక్షలను టీడీపీకి చెందిన సోమశేఖర్ వద్ద ఉంచాలని గ్రామస్తులంతా తీర్మానం చేశారు. ఈ విషయం గిట్టని సర్పంచ్ అశోక్ అక్కడి నుంచి ఆవేశంతో వైదొలిగాడు. అనంతరం ముందుగానే రూపొందించుకున్న పథకం మేరకు.. 25 మంది రౌడీలను పిలిపించి ఎవరిపై దాడి చేయాలో అశోక్‌తో పాటు ఆయన తమ్ముడు మేఘనాథ్, పెద్దనాన్న కుమారులు శ్రీకాంత్, నరేంద్ర, సంతోష్, బ్రహ్మానంద చూపిస్తుండగా స్థానిక యువకులు గుర్తించారు. బొమ్మనహాళ్ మండలం గోవిందవాడకు చెందిన గడార్ల హనుమంతప్ప కుమారుడు బసప్ప దుర్భాషలాడుతూ పెద్ద మనుషులపై దాడికి యత్నించగా, మిగిలిన వారు దూసుకొచ్చారు. అప్పటికే అప్రమత్తంగా ఉన్న గ్రామస్తులంతా సంఘటితమై ప్రతిఘటించడంతో రౌడీమూక చెల్లాచెదురైంది. అశోక్ వర్గీయులు సైతం ఇళ్లలోకి దూరి దాక్కున్నారు. జరిగిన విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలూ తీసుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. కాగా, దీనిపై పోలీసులను వివరణ కోరగా సర్పంచ్ అశోక్ వర్గం ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమశేఖర్ వర్గీయులు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

'వైఎస్సార్ సంపూర్ణ పోషణ'తో ఆరోగ్యం



వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్



మదిగుబ్బలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందిస్తున్న సర్పంచ్ నరసింహ

రాప్తాడురూరల్: వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అనంతపురం రూరల్ మండల జెడ్పీటీసీ సభ్యుడు జూటూరు చంద్ర కుమార్ పేర్కొన్నారు. గురువారం రూరల్ మండల పరిధిలోని కక్కలపల్లి అంగన్‌వాడీ-2 కేంద్రంలో లబ్ధిదారులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోం రేషన్ అందజేశారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా రేషన్‌ను ఇంటికే పంపిణీ చేస్తున్నామన్నారు. గర్భిణులు, మహిళలు, పిల్లల్లో రక్తహీనత నివారించేందుకే ఈ పథకాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు. ఒకసారి రక్తహీనతకు గురైతే వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోతుందని, తద్వారా వ్యాధులు త్వరగా వస్తాయన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి సీఎం జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ

ఆత్మకూరు: మండలంలోని మదిగుబ్బ గ్రామంలో లబ్ధిదారులకు సర్పంచ్ నరసింహ (దాదా) చేతుల మీదుగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను గురువారం అందించారు. సర్పంచ్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గర్భిణులు, బాలింతలకు ఇబ్బందులు తలెత్తకుండా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ లక్ష్మీదేవి, పెద్దన్న, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే రేషన్

కనగానపల్లి: వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమం కింద అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతల ఇంటి వద్దకే రేషన్ అందిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రశాంతి తెలిపారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో టేక్ హోం రేషన్ కార్యక్రమం కింద మహిళలు పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలు అందించారు. వీటిని గర్భిణులు, బాలింతలు సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పలువురు అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

సంపూర్ణ పోషణతోనే ఆరోగ్యం

రామగిరి: 'వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ'తోనే ఆరోగ్యంగా ఉండొచ్చని తహసీల్దార్ నారాయణ స్వామి, ఎంపీటీసీ మీనుగ నాగమ్మ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ప్రభుత్వం సరఫరా చేసిన వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లను వారు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మీనుగ నాగరాజు, ఎంఈఓ-2 శ్రీనివాసులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గంగాభవాని, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు సర్వే నిర్లక్ష్యం చేయద్దు



ఐదోరోడ్డులో ఓటరు సర్వేను పరిశీలిస్తున్న అదనపు కమిషనర్ రమణారెడ్డి



తగరకుంటలో బీఎల్ఓకు దరఖాస్తులు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అనంతపురం క్రైం: ఓటరు సర్వేను నిర్లక్ష్యం చేయకూడదని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ రమణారెడ్డి పేర్కొన్నారు. గురువారం నగరంలోని 2,3,4,5, రోడ్లలో జరుగుతున్న ఇంటింటా ఓటరు సర్వేను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ నెల 21లోపు ఓటరు సర్వేను పూర్తి చేయాలన్నారు. నగరంలోని 2,63,000 మందికిగానూ 15 శాతం మాత్రమే పూర్తి చేశారన్నారు. నిర్లక్ష్యం వీడకుంటే మెమోలు జారీ చేస్తామని హెచ్చరించారు. అనంతరం క్లాప్ ఆటోల నిర్వహణను ఆయన పరిశీలించారు. యూజర్ చార్జీలను వసూలు చేయాలన్నారు. సీజినల్ వ్యాధులు ప్రబలే సమయంలో ఎప్పటికప్పుడు చెత్తా చెదారాన్ని తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మధ్యాహ్నం నగరపాలక సంస్థలో వివిధ విభాగాల సూపరింటెండెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, తదితరులతో ఆయన సమావేశమయ్యారు. కోర్టు కేసులకు సంబంధించి ఫైళ్లను జాగ్రత్తగా ఉంచాలన్నారు.

ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టండి

కనగానపల్లి: ప్రస్తుతం జరుగుతున్న ఓటరు నమోదు కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని నాయకులు, కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి సూచించారు. గురువారం ఆయన జెడ్పీటీసీ మారుతీ ప్రసాద్, పార్టీ నాయకులతో కలిసి తగరకుంటలో పర్యటించారు. ఓటరు నమోదు కార్యక్రమంపై బీఎల్ఓలతో సమావేశమై కొత్త ఓటర్ల నమోదుపై అవగాహన కల్పించారు. ఓటరు జాబితా పరిశీలనకు గ్రామాల్లో తిరుగుతున్న బీఎల్ఓలను కలిసి కొత్తగా ఓటు నమోదు చేయించుకునే వారి నుంచి దరఖాస్తులు అందజేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ మండల బూత్ కమిటీ ఇన్‌చార్జ్ అమరనాథరెడ్డి, ఎంపీటీసీ కృష్ణారెడ్డి, పార్టీ నాయకులు భాస్కరరెడ్డి, మహేష్, రమణారెడ్డి, గోవిందురెడ్డి, శ్రీనివాసులుపాల్గొన్నారు.

క్లుప్తంగా

లక్ష్యం నిర్దేశించుకుని చదవాలి



పుస్తకాలను అందిస్తున్న రిటైర్డ్ డిప్యూటీ గోవిందరాజులు

అనంతపురం: పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు, విద్యార్థులు లక్ష్యం నిర్దేశించుకొని చదవాలని, అప్పుడే కొలువులు సాధించగలరని విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు అన్నారు. గురువారం గ్రూప్ -2, డీఎస్సీ, ఎస్ఎస్‌సీ, పోలీస్ కానిస్టేబుల్ తదితర పోటీ పరీక్షల పుస్తకాలను జిల్లా మహిళా, బాలల గ్రంథాలయాలకు విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ అందించారు. గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమ అధ్యక్షత వహించారు. అనంతరం విశ్రాంత డిప్యూటీ కలెక్టర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు ఎల్ఎం మోహన్‌రెడ్డి, కార్యదర్శి రమ, ఉప గ్రంథాలయ అధికారి సుబ్బరత్నమ్మ, సీనియర్ అసిస్టెంట్ కే శివ శంకర్, ఇంతియాజ్ అహ్మద్, ప్రవల్లిక తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి సమస్య పరిష్కరిస్తాం

ఆత్మకూరు: మండల కేంద్రంలోని అంకాలమ్మ ఆలయం వద్ద నుంచి ఎస్సీ కాలనీలోకి వెళ్లే రోడ్డులో మురుగునీటి సమస్య పరిష్కరిస్తామని ఈఓఆర్డీ దామోదర్‌రెడ్డి తెలిపారు. మురుగునీటి సమస్యపై స్థానికులు పంచాయతీ కార్యాలయంలో అధికారులకు తెలియజేశారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ శిరీష, జూనియర్ అసిస్టెంట్ వాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకట్రాముడు, ఉప సర్పంచ్ తైదుల శివారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగరాజు, లక్ష్మీనారాయణరెడ్డి, వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దాం



ఆత్మకూరు గ్రామ సభలో మాట్లాడుతున్న సర్పంచ్ వరలక్ష్మి

ఆత్మకూరు: మేజర్ పంచాయితీ అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దామని ఆత్మకూరు సర్పంచ్ వరలక్ష్మి తెలిపారు. గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలన్నారు. ఈ నెల 9న మనం - మన భూమి కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ తైదుల శివారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వెంకట్రాముడు, పంచాయతీ సెక్రటరీ శిరీష, గ్రామ సచివాలయ కన్వీనర్లు ఓబీ టైలర్ వెంకటేష్, శ్రీరామ్, లక్ష్మీనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీరువా వితరణ



బీరువాను అందిస్తున్న పూర్వ విద్యార్థులు రమేష్, రాజేష్‌గుప్తా

రాప్తాడురూరల్: ఆర్ట్స్ కళాశాలకు కొడుకు ఎన్‌వీ సాయిరంగ జ్ఞాపకార్థం తండ్రి రమేష్ బీరువా వితరణ చేశారు. 2019లో బీకాం పూర్తి చేసుకొని అనారోగ్య కారణాలతో ఎన్‌వీ సాయిరంగ మృతి చెందాడు. ఈయన తండ్రి ఎన్.రమేష్ ఆయన మిత్రుడు ఎస్.రాజేష్‌గుప్తా ఇద్దరూ 1993లో ఇదే కళాశాలలో బీకాం చదివారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఏసీఆర్ దివాకర్‌రెడ్డి, అధ్యాపకులు డాక్టర్ రంగనాథ్, శ్రీనివాసులు, ఎం.వెంకటస్వామి, సి.రవీంద్రారెడ్డి, ఎం.మల్లికార్జున, సి.సుమంగళి పాల్గొన్నారు.

పాడిరైతుల సంక్షేమానికి కృషి



పశువులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కూడేరు: పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్య నిర్వాహణాధికారి డాక్టర్ సుధాకర్ అన్నారు. గురువారం మండలంలోని కమ్మూరులో ఉచిత గర్భకోశ చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. పాడి పశువులకు ఆయన వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పాడితో ఆర్థికాభివృద్ధి చెందవచ్చన్నారు. పాడి పశువులకు రోజూ గ్రాసమే కాకుండా పోషకాలతో కూడిన దాణా అందించాలన్నారు. ఆడ దూడ పుట్టేందుకు రూ.1,350 విలువ చేసే రెండు కృత్రి గర్భధారణ ఇంజక్షన్లను సబ్సిడీతో కేవలం రూ.500కు ప్రభుత్వం ఇస్తోందన్నారు.

ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టండి



ఏఓలతో సమావేశమైన ఏడీఏ రవి

అనంతపురం అగ్రికల్చర్: ప్రత్యామ్నాయ పంటలు సాగుపై దృష్టిసారించాలని అనంతపురం సబ్ డివిజన్ ఏడీఏ రవి ఆదేశించారు. గురువారం స్థానిక ఏడీ కార్యాలయంలో ఆరు మండలాల ఏఓలు, ఏఈఓలతో సమావేశం నిర్వహించారు. ఆర్‌బీకే వారీగా సాగైన వివరాలు, అవసరమైన ప్రత్యామ్నాయ విత్తనాల వివరాలు అందించాలన్నారు. ఒక్క ఎకరం కూడా బీడుగా ఉంచకుండా ఏదో ఒక రకం పంట సాగుచేసేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. పీఎం కిసాన్ కింద వంద శాతం ఈకేవైసీ పూర్తి కావాలన్నారు. కౌలుదారులను గుర్తించి సీసీఆర్‌సీ అందించాలన్నారు. ఆర్‌బీకేల్లో ఎరువుల అమ్మకాలు పెంచాలని ఆదేశించారు. ఎస్ఎఫ్ఎస్ఎం కింద వేరుశనగ, కంది పంటల డెమాన్‌స్ట్రేషన్లు చేపట్టాలని తెలిపారు. ఏఓలు శశికళ, వెంకటేశ్వర ప్రసాద్, సోమశేఖర్, శ్యామ్‌సుందర్‌రెడ్డి, సుచరిత, విజయకుమార్ పాల్గొన్నారు.

ఈ- వ్యర్థాల నిర్వహణపై అవగాహన సదస్సు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ సెక్రటరీ డాక్టర్ ఎం. రామకృష్ణారెడ్డి

అనంతపురం: ఈ-వ్యర్థాల (ఎల్రక్టానిక్) నిర్వహణపై ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, అనంతపురంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్, అనంతపురం, ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ (ఇండియా) అనంతపురం లోకల్ సెంటర్ సంయుక్తంగా కార్యక్రమం నిర్వహించింది. కార్యక్రమానికి పీపుల్స్ ఫోరం ఆఫ్ ఇండియా అధ్యక్షుడు వెన్నపూస రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ-వ్యర్థాలు పర్యావరణానికి ఎలా హాని కలిగిస్తాయి? ఈ-వ్యర్థాలను తిరిగి ఎలా వినియోగించాలి అనే అంశంపైన అవగాహన కల్పించారు. విశిష్ట అతిథులుగా సుబ్రమణ్యం ఎడ్యుకేషనల్ ట్రస్టు , తిరుపతి డైరెక్టర్ జి. విశ్వనాథ్ హాజరై మాట్లాడారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ (ఇండియా) సెక్రటరీ డాక్టర్ ఎం. రామకృష్ణారెడ్డి అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అనంతపురం ప్రిన్సిపాల్ సి.జయచంద్రా రెడ్డి, శ్రీ లిఖిత ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు జీహెచ్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



• ఇటు పొలం బాట.. అటు ప్రగతి బాట

ఈ చిత్రంలో కనిపిస్తున్న ఈమె వైఎస్సార్ కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల..ఈమె ప్రగతి రథానికి ముందు చక్రంలా..పొలానికి వెళ్తే కూలీలకు 'సాయం'గా బరువు, బాధ్యతలను సునాయాసంగా మోస్తున్నారు..బాధ్యతాయుత పదవిలో కొనసాగుతూనే..కాస్త సమయం దొరికితే చాలు కూలీలతో కలిసి పొలం పనుల్లోనూ నిమగ్నమవుతారు..నిత్యం బాధ్యతలతో తలమునకలయ్యే ఆమె.. ఇటు 'పొలం బాట..అటు ప్రగతి బాట'ను సమర్థంగా నడిపిస్తూ అందరిచేత శభాష్ అనిపించుకుంటున్నారు. గురువారం ఆత్మకూరు మండలంలోని పంపనూరు వద్ద తన వ్యవసాయ పొలంలో కూలీలతో కలిసి రాళ్లు మోస్తూ కనిపించిన దృశ్యాన్ని 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:

మోదీ పాలనలో మహిళలకు రక్షణ కరువు

• ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి



పోరుయాత్రలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

అనంతపురం అర్బన్: ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వ పాలనలో మహిళలకు రక్షణ కరువైందని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి విమర్శించారు. దాడులు, హత్యలు, అత్యాచారాలు, హింసలేని సమాజాన్ని నిర్మించుకుంటేనే మానవ మనుగడ సాధ్యమన్నారు. మహిళలపై హింసను వ్యతిరేకిస్తూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో చేపట్టిన పోరుయాత్ర బస్సుజాతా గురువారం అనంతపురం చేరుకుంది. నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ఐద్వా జిల్లా అధ్యక్షురాలు రాజేశ్వరి అధ్యక్షతన జరిగిన సభలో రమాదేవి మాట్లాడారు. కేంద్రంతో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడల్లా సమాజాంపై దాడి జరుగుతోందని అన్నారు. గుజరాత్ సంఘటనను ఇప్పటికీ దేశం మర్చిపోలేదన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రం మణిపూర్‌లో జరుగుతున్న మారణహోమం దేశ చరిత్రలో మాయని మచ్చలా ఉందన్నారు. మహిళలను నగ్నంగా ఊరేగించి, అత్యాచారం ఆపై హత్య చేయడం అత్యంత పాశవిక చర్య అన్నారు. నాడు గుజరాత్, నేడు మణిపూర్ రెండు ఘటనల్లోనూ మహిళలు అత్యంత దారుణంగా హింసకు గురై ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వం తన స్వార్థ రాజకీయాల కోసం అధికారాన్ని అడ్డుపెట్టుకొని కుట్రతో ప్రజల మధ్య చిచ్చుపెడుతోందని ఆరోపించారు. వీటన్నింటికీ బీజేపీ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, నాయకురాళ్లు రమాదేవి, నాగమణి, శ్యామల, కృష్ణవేణి, లక్ష్మీనరసమ్మ, మంజుల, జ్యోతి, మరియమ్మ, కృపమ్మ, నాగభూషణం, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పశువులకు ముద్దచర్మ వ్యాధి టీకాలు

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా శుక్రవారం పాడి పశువులకు ముద్దచర్మ వ్యాధి టీకాలు ఉచితంగా వేయనున్నట్లు పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ రమేష్ పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ పశువులకు ముద్దచర్మ వ్యాధి సోకకుండా ముందు జాగ్రత్తగా ప్రభుత్వం వ్యాక్సిన్ అందిస్తోందన్నారు. పాడి పశువులు రైతులు పశువులు, దూడలకు వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు.

గడ్డివామి దగ్ధం

గార్లదిన్నె:పి.కొత్తపల్లిలో గురువారం తెల్లవారుజామున అగ్నిప్రమాదంలో రైతు వెంకటేషుకు చెందిన వరి గడ్డివాము దగ్ధమైంది. దాదాపు రూ.1.7 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పంచాయతీ కార్యదర్శిపై విచారణ

కుందుర్పి: అప్పిలేపల్లి పంచాయతీ కార్యదర్శి రాజన్న ఎనిమిది నెలలుగా విధులకు హాజరుకాకపోవడంపై అనంతపురం డీఎల్‌పీఓ సుజనా జయంతి విచారణ చేపట్టారు. గురువారం ఎంపీడీఓ వెంకటనాయుడుతో కలసి పంచాయితీ కార్యదర్శి రాజన్నపై విచారణ చేపట్టి గ్రామస్తులు, అధికారుల నుంచి వివరాలు సేకరించారు. రాజన్నను ఇటీవల అప్పిలేపల్లి నుంచి రాయదుర్గం మండలానికి ప్రభుత్వం బదిలీ చేయగా.. ఆయన జాయిన్ కాకపోవడంపై విచారణ చేపట్టినట్లు డీఎల్‌పీఓ తెలిపారు.నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు.

పేద విద్యార్థులకు ఆర్డీటీ సహకారం

గుంతకల్లుటౌన్: పేద విద్యార్థులకు ఎల్లప్పుడూ ఆర్డీటీ సహకారమందిస్తుందని సంస్థ డీఈబీ శ్రీకుమార్ చటోపాధ్యాయ, రీజినల్ డైరెక్టర్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆర్డీటీ సంస్థ గతంలో నిర్మించిన తరగతి గదులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సాలాబాయి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యార్థుల చదువుకు ఆర్డీటీ తోడ్పాటునందిస్తుందని చెప్పారు. అనంతరం ప్రిన్సిపాల్ అభ్యర్థన మేరకు వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఆర్డీటీ(ఐఎఫ్ఐ) ఏడీ గంగప్ప ఎన్ఎస్ఎస్ పీఓలు శివప్రసాద్, నాగమణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ నేరం

బుక్కరాయసముద్రం: లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని మండల డాక్టర్ తెహరున్నీసా, హెల్త్ ఎడ్యుకేటర్ పర్వీన్ పేర్కొన్నారు. గురువారం కేజీబీవీలో విద్యార్థులకు ఆడపిల్లల అభివృద్ధికి తోడ్పడుదాం అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా విద్యార్థులు, వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బాలికల విద్య, సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ నాగవేణి, హెల్త్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, పీహెచ్ఎన్ చెన్నమ్మ, రమీజా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఓపీల్లో సీనియర్ వైద్యులు ఉండాలి

అనంతపురం క్రైం: ఔట్ పేషంట్లకు(ఓపీ) అందించే సేవల్లో సీనియర్ వైద్యులు అందుబాటులో ఉండాలని సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు పేర్కొన్నారు. గురువారం సర్వజనాస్పత్రిలోని వివిధ ఓపీ విభాగాలను ఆయన పరిశీలించారు. పలు విభాగాల ఓపీల్లో పీజీ వైద్యులు అధికంగా కన్పించడంతో ఆయన సంబంధిత హెచ్ఓడీలకు చురకలు అంటించారు. పోస్టు గ్రాడ్యుయేషన్ వైద్యులకే మొత్తం అప్పగించొద్దని, సీనియర్ వైద్యులు విధిగా ఓపీలు చూడాలన్నారు. ఓపీల్లో రోగులను చూసినప్పుడు వారి అనారోగ్య సమస్యను లోతుగా తెలుసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధుల్లో ఉండాల్సిందేనన్నారు.

విద్యార్థినుల ఆరోగ్యంపై అజాగ్రత్త ఎందుకు?

అనంతపురం క్రైం: కేఎస్ఆర్ బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థినుల ఆరోగ్యంపైన నిర్లక్ష్యం చేశారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పాఠశాల విద్యార్థినులు శ్రీలక్ష్మి, ప్రవల్లిక, భవ్యశ్రీ (6వ తరగతి), ప్రణతి (4వ తరగతి) గురువారం ఆయాసంతో ఇబ్బంది పడుతున్నారు. ఈ సమయంలో ఉపాధ్యాయులు బాధితులకు ఏడో తరగతి విద్యార్థిని నందినిని జతచేసి, ప్రభుత్వ సర్వజనాస్పత్రికి పంపారు. సర్వజనాస్పత్రిలో ఎమర్జెన్సీ వార్డుకు వెళ్లగా అక్కడి వైద్యులు పరీక్షించి, చిన్నపిల్లల వార్డుకు రెఫర్ చేశారు. విద్యార్థినుల తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు సమాచారం మాత్రం అందించి చేతులుదులుపుకోవడంపై విమర్శలు వచ్చాయి. గతంలోనూ నందిని అనే విద్యార్థినే తమను సర్వజనాస్పత్రికి తీసుకొచ్చిందని బాలికలు తెలిపారు. బాలికల పట్ల ఉపాధ్యాయులు నిర్లక్ష్యం సరికాదని ఓ బాలిక తండ్రి నాగరాజునాయక్ అన్నాడు.

ఆక్రమణల తొలగింపు

అనంతపురం క్రైం: నగరంలోని 32వ డివిజన్ లక్ష్మీనరసయ్య కాలనీలో ఓ అక్రమ నిర్మాణాన్ని తొలగింపునకు టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకున్నారు. పట్టణ ప్రణాళిక కార్యదర్శి హర్షిత, సిబ్బంది లక్ష్మీనరసయ్య కాలనీలో అక్రమ నిర్మాణాన్ని పాక్షికంగా తొలగించారు. నగరపాలక సంస్థ అనుమతి తీసుకొని నిర్మాణం చేపట్టాలని, ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపడితే తొలగిస్తామని ఏసీపీ బాలాజీ తెలిపారు.

కడదరగుట్టపల్లిలో ఘర్షణ

పెద్దవడుగూరు : కడదరగుట్టపల్లిలో స్థల వివాదమై ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో వైఎస్సార్‌సీపీ నేత బైరవకొండారెడ్డి, రవికుమార్‌కు గాయాలయ్యాయి. వైస్ ఎంపీపీ హరినాథరెడ్డి రెండేళ్ల క్రితం వ్యవసాయ భూమి కొనుగోలు చేశాడు. ఈ క్రమంలో భూమి కొలతలు వేయించుకొని హద్దులు ఏర్పాటు చేసుకున్నాడు. ఈ భూమిలో తమ పొలాలకు వెళ్లడానికి స్థలం ఉందంటూ రవికుమార్ వర్గం వారు గురువారం గొడవకు దిగారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

సెంట్రింగ్ సామాన్లు అపహరణ

పామిడి: పీ కొత్తపల్లి సమీపంలోని ఓ తోటలో ఉంచిన సెంట్రింగ్ సామగ్రి చోరీకి గురైంది. వివరాలు.. సెంట్రింగ్ కార్మికుడు పీ వడ్డే శివకుమార్ వైఎస్సార్‌సీపీ నేత ఎంహెచ్ అనిల్‌కుమార్‌రెడ్డికి సంబంధించిన వారి సమాధి నిర్మాణ నిమిత్తమై సెంట్రింగ్ సామాన్లను తరలించారు. గుర్తు తెలియని వ్యక్తులు రూ.40 వేల విలువైన సామగ్రిని ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎంప్లాయీస్ స్కీం విధానంతో అవస్థలు

• ఆర్టీసీ ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు దామోదరరావు

అనంతపురం సెంట్రల్: ఆర్టీసీ ఉద్యోగులు ఎంప్లాయీస్ స్కీం విధానంతో ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఏపీ పీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు దామోదరరావు తెలిపారు. గురువారం నగరంలో బాలాజీ కళ్యాణమంటపంలో ఉమ్మడి జిల్లాల విస్తత స్థాయి కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఆర్టీసీ ఉద్యోగులకు 24 గంటలు సేవలందించాల్సి ఉంటుందని, గతంలో మెరుగైన వైద్యం కోసం రెఫరల్ ఆస్పత్రుల్లో సేవలు పొందేవారన్నారు. కానీ ప్రభుత్వంలో విలీనం అనంతరం రెఫరల్ విధానాన్ని రద్దు చేసి ఎంప్లాయీస్ స్కీమ్ విధానాన్ని తీసుకొచ్చారని, దీంతో ఇబ్బందులు తలెత్తుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్రమణ్యం రాజు, జోనల్ అధ్యక్షులు కేకే కుమార , గౌరవాధ్యక్షులు రాజారెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షులు జేవైపీ రావు, రెండు జిల్లాల అధ్యక్షులు మల్లికార్జున, నాగార్జునరెడ్డి, నాయకులు ఖాన్, కల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

ఇంగ్లిష్‌పై నైపుణ్యంతోనే ఉద్యోగావకాశాలు



విద్యార్థికి బహుమతి అందిస్తున్న చైతన్య పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి

రాప్తాడురూరల్:ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఇంగ్లిష్ భాషపై పట్టు సాధిస్తేనే ఉద్యోగావకాశాలు లభిస్తాయని శ్రీచైతన్య పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి స్పష్టం చేశారు. గురువారం అనంతపురం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని శ్రీ చైతన్య ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఇంగ్లిష్ క్లబ్ నిర్వహించారు. పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పిల్లలు ఏర్పాటు చేసిన చార్ట్‌లు, నాటికలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఏజీఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ నేటి సమాజంలో ఇంగ్లిష్‌కు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. ప్రతి విద్యార్థీ మాతృభాషలాగానే ఇంగ్లిష్ నేర్చుకోవాలన్నారు. అనంతరం ఏజీఎం, పాఠశాల ప్రిన్సిపాల్ పర్వీన్ చేతుల మీదుగా వ్యాసరచన, మంచి చేతిరాత రాసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల డీన్ చంద్రమోహన్, ప్రైమరీ ఇన్‌చార్జ్ మాధవీలత, ఇంగ్లిష్ విభాగం హెచ్ఓడీ శశికళ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులకు క్షమాపణ చెప్పాలి

అనంతపురం క్రైం: తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి బేషరతుగా తమకు క్షమాపణ చెప్పాలని ఏపీ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం ఇటీవల ఓ టీవీ షోలో నాయీ బ్రాహ్మణులను మంగళోడు అని జేసీ ప్రభాకర్‌రెడ్డి సంబోధించడాన్ని వారు తప్పుపట్టారు. అనంతరం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి మరోసారి గట్టిగా బుద్ధి చెబుతామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయీబ్రాహ్మణ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి నరసింహులు, కార్యదర్శి జీఎం విజయభాస్కర్, నాయకులు రామకృష్ణ, శివకుమార్, లక్ష్మీనారాయణ, మధు, పాల్గొన్నారు.

8న రామకృష్ణ సేవా సమితి వార్షికోత్సవం

అనంతపురం కల్చరల్: నగరంలోని హెచ్చెల్సీ కాలనీ సేవా సమితి కార్యాలయంలో శ్రీరామకృష్ణ సేవా సమితి 19వ వార్షికోత్సవం ఈనెల 8న నిర్వహించనున్నారు. సామూహిక విష్ణు సహస్రనామపారాయణం, శ్రీ రామకృష్ణ పరమహంస కథామృత పఠనం, సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి. శ్రీరామకృష్ణ అవతార విశిష్టతపై వైఎస్సార్ జిల్లా నుంచి విచ్చేసే స్వామి సన్నివాసానంద మహారాజ్ అనుగ్రహ భాషణం చేస్తారు. ఈ మేరకు రామకృష్ణ సేవా సమితి ప్రధాన కార్యదర్శి శ్రీధరమూర్తి గురువారం సేవా సమితి కార్యాలయంలో ఆ వివరాలు అందించారు.